
అపరిశుభ్రతకు నిలయం

- అరబ్‌గల్లీ, ఇండస్ట్రియల్ ఏరియాలో చెత్తాచెదారం
- న్యూప్రేమ్‌నగర్‌లో అక్కడక్కడా దెబ్బతిన్న రోడ్లు

18వ వార్డులో జనాభా: 6,229
ప్రధాన వీధులు: కమలానెహ్రూకాలనీ, పరిమళగిరి, న్యూ ప్రేమ్‌నగర్ (కొంత భాగం), ఇండస్ట్రియల్ ఏరియా, అరబ్‌గల్లీ ప్రాంతం.


ఇండస్ట్రియల్ ఏరియాలో డ్రెయినేజీ ఇలా..

వార్డ్ వాచ్


పరిమళగిరిలో మట్టి రోడ్డు..


అరబ్‌గల్లీలో రోడ్డుపై పేరుకుపోయిన మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 18వ వార్డులోని ఇండస్ట్రియల్ ఏరియా, అరబ్‌గల్లీలలో చెత్తాచెదారం పేరుకుపోతోంది. ఊడ్చడానికి పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇండస్ట్రియల్ ఏరియాలో సుమారు 50 ఫ్యాక్టరీలు ఉంటాయి. అయితే పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. రోడ్ల పక్కన ఉండే డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో కంపుకొడుతోంది. కొన్ని చోట్ల రోడ్లు కంకర తేలి అధ్వాన స్థితికి చేరాయి. ఆయా పరిశ్రమల్లో తయారయ్యే వివిధ ఉత్పత్తులను ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించడానికి ఎన్నో పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కడికక్కడ రోడ్లపై గుంతలు పడ్డాయి. హైదరాబాద్ మెయిన్ రోడ్డు నుంచి ఇండస్ట్రియల్ ఏరియా లోపలికి వెళ్లాలంటే నీటి మడుగును దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా మురుగుతో పాటు వర్షపు నీరు నిలిచినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ప్రాంతం మొత్తం నిర్వహణ బాధ్యతలను పరిశ్రమల శాఖ చూసుకుంటుందని మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ చెబుతున్నారు. ఇక న్యూప్రేమ్‌నగర్‌లో దాదాపు అన్ని గల్లీలలో సీసీ రోడ్లు ఉన్నా పలు చోట్ల ధ్వంసమయ్యాయి. కమలా నెహ్రూకాలనీలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ సమీపంలో రోడ్డు పక్కనే చుట్టుపక్కలవారు చెత్త వేస్తున్నారు. మున్సిపల్ వాహనం ఇళ్ల వద్దకు వచ్చినా కొందరు యజమానులు చెత్త ఇవ్వకుండా అక్కడ పడేస్తున్నారు. పరిమళగిరి ప్రాంతం మొత్తం ఎత్తు ప్రదేశంలో ఎగుడు దిగుడుగా ఉంటుంది. గల్లీలలో సీసీ, బీటీరోడ్లు ఉన్నా ఊడ్చడానికి, డ్రెయినేజీలు శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులు నెలలో ఎప్పుడో ఒకసారి వస్తుంటారని స్థానికులు పేర్కొంటున్నారు. అరబ్‌గల్లీలోని వీధులన్నీ ఇరుకుగా ఉన్నాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్రంగా చెత్త పేరుకుపోయింది. మోరీలలోని మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేదు. ఓ ఫంక్షన్‌హాలుకు ఎదురుగా ఇటీవల మెయిన్ రోడ్డు వరకు ఉన్న డ్రెయినేజీని కొందరు వ్యక్తులు పూడ్చివేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పెద్ద నాలా సమీపంలోని కొన్ని ఇళ్లు హైదరాబాద్ మెయిన్ రోడ్డుకు కిందికి ఉండటంతో వర్షాకాలంలో నీరు లోపలికి వస్తుందని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు.

డ్రెయినేజీలు తీయడం లేదు



మా ప్రాంతంలో డ్రెయినేజీలు శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారు. అవి నిండిపోయి మురుగంతా రోడ్డుపైకి వస్తుంది. దీంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెద్ద నాలా వరకు పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలి. ఓ హోటల్ నిర్వాహకులు కట్టెలతో పెద్ద పొయ్యిని వెలిగించడంతో పొగ కమ్ముకుంటుంది. వ్యర్థ పదార్థాలు, కలుషిత జలాలు పక్క డ్రెయినేజీలో కలిసి దుర్గంధం వస్తుంది.
– ముస్తాక్ ఇమాం, అరబ్‌గల్లీ

మేమే ఊడుస్తాం..



మా వీధి మొత్తం గుట్ట ప్రాంతం కావడం వల్ల ఎత్తులో ఉంటుంది. రోడ్లు ఊడ్చడానికి, మోరీలు తీయడానికి 15 రోజులకోసారి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వస్తారు. సమీపంలోనే గురురాఘవేంద్రస్వామి ఆలయం ఉంది. బీటీరోడ్డు పై వరకు ఉన్నా శుభ్రం చేయడానికి ఎవరూ రాకపోవడంతో మేమే ఊడుస్తాం. ఎదురుగడ్డ కావడంతో వృద్ధులు ఆయాస పడుతున్నారు. మా ఇంటి ముందున్న మెట్లను సీసీరోడ్డు వేస్తున్న సమయంలో తొలగించారు. లోపలికి వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.
– సువర్ణ, పరిమళగిరి ప్రాంతం

అభివృద్ధి పనులు చేశాం



మూడేళ్ల కాలంలో సుమారు రూ.1.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేయించాం. కొన్ని గల్లీలలో ఇరుకు రోడ్లు ఉన్నది వాస్తవమే. మంత్రి సహకారంతో వార్డుకు ఇటీవలే రూ.2.45 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతోనే ఈ గల్లీలలో భూగర్భ డ్రెయినేజీ (సిమెంట్ పైపులైన్)ని ఏర్పాటు చేస్తాం. పరిమళగిరి పాత కమాన్‌ను తొలగించి పెద్దది నిర్మిస్తాం. అరబ్‌గల్లీలోని ఫంక్షన్‌హాలుకు ఎదురుగా డ్రెయినేజీని ఏర్పాటు చేయిస్తాం. పారిశుద్ధ్య పనుల కోసం మున్సిపల్ కార్మికులకు సూచనలిస్తాం.
– జె.కిశోర్‌కుమార్, కౌన్సిలర్, 18వ వార్డు

క్లుప్తంగా

పోశమ్మ దేవాలయానికి భూమిపూజ



అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్దిలో పోశమ్మ దేవాలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. గ్రామస్తులందరూ కలిసి చందాలు వేసుకుని పునర్నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట్ల రవి, అశోక్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణ, చంద్రయ్య, బడ బాలరాజు, రత్నయ్య, నరేష్, తిరుపతి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ పంచాయతీ పరిధిలోని నర్సంపల్లితండా ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదింటి వివాహాలకు ఆర్థికసాయం

రాజాపూర్: పేదింటి వివాహాలకు బుధవారం దొండ్లపల్లి ఎంపీటీసీ అభిమన్యూరెడ్డి ఆర్థికసాయం అందించారు. మండలంలోని తిర్మలాపూర్ చెందిన కావలి యాదయ్య కూతురు వివాహానికి, కొత్త జంగయ్య కూతురు వివాహానికి, మల్లేపల్లి పంచాయతీ పరిధిలోని తిమ్మారెడ్డికుంటతండాకు చెందిన లక్ష్మన్ కుమార్తె వివాహానికి, నాన్‌చెరువుతండాకు చెందిన గోబిరియా కూతురు, పల్గుతండాకు చెందిన కృష్ణనాయక్ కూతురు వివాహానికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, చిరంజీవి, రమేష్‌నాయక్, కావలిరాజు, ఎన్నం కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆటోస్టాండ్ వద్ద బుధవారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ కేక్‌కట్ చేసి నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఐఎన్‌టీయూసీ అతిపెద్ద ట్రేడ్ యూనియన్ అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ముందుండి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాబుమియా, మహ్మద్ అలీ, రాజు, గోపాల్, ఖాదర్, అబ్దుల్లా, వెంకటేష్, శ్రీను, దేవా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



మహమ్మదాబాద్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని షేక్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎంతో శ్రమించి పండించిన పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోతున్నారని తెలిపారు. అందుకు ప్రభుత్వం మంచి ధరను చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి చెల్లించాల్సిన డబ్బులను వారి అకౌంట్‌లో వారం రోజుల్లోపు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్‌హసీబోద్దీన్, ఎంపీటీసీ వెంకట్రాములు, బిక్షపతి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

జడ్చర్ల: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలో బ్యాడ్మింటన్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలకు తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే ప్రతి గ్రామం, పట్టణంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం


పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుధాశ్రీ

మహబూబ్‌నగర్ రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ సుధాశ్రీ అన్నారు. మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డ్వాక్రా మహిళా భవనానికి ఎంపీపీ నిధులు మంజూరు చేసి బుధవారం భవన పనులను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం భవనాల నిర్మాణాలు చేపడుతుందని అన్నారు. రాష్ట్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊశన్న, వెంకటమ్మ, రాఘవేందర్‌గౌడ్, మనోహర్‌గౌడ్, భర్తన్‌గౌడ్, సత్తయ్య, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

స్థల పరిశీలన

మిడ్జిల్: మండల కేంద్రంలో నిర్మించనున్న అంబేడ్కర్ కళాభవన నిర్మాణానికి బుధవారం మండల కేంద్రంలోని రైస్ మిల్లు సమీపంలోని స్థలాన్ని ఎంపీపీ సుదర్శన్, తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి రూ.25లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ తెలిపారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

వంటావార్పుతో కార్యదర్శుల నిరసన


మిడ్జిల్‌లో మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

గండేడ్: పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో వంటావార్పు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఉద్యోగాలు కల్పించి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తమను క్రమబద్ధీకరించలేదని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రవికుమార్, అశోక్, కలీమ్, ప్రవళిక, రాధ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: వారం రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీసీసీ కార్యదర్శి అనిరుద్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న కార్యదర్శులకు, వీఓఏలకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆయన వెంట ఎంపీటీసీలు గౌస్, నర్సింహ, రాజారెడ్డి, నాయకులు అల్వాల్‌రెడ్డి, సంపత్, అశోక్, జహంగీర్, జంగయ్య ఉన్నారు.

కోయిల్‌కొండ: నాలుగేళ్ల ప్రోహిబిషన్ పూర్తి చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు వారి డిమాండ్లకు అనుగుణంగా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఆరవ రోజు విధులు బహిష్కరించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నందకిశోర్, నరేష్, ప్రవీణ్, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


గండేడ్‌లో వంటావార్పు చేస్తున్న కార్యదర్శులు

నవాబుపేట: మండల కేంద్రంలో కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ మద్దతు తెలిపారు. వెట్టిచాకిరి చేయించుకుని వారికి ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. వారికి న్యాయం చేసే దాకా పోరాటంలో వెన్నంటే ఉంటామన్నారు. కార్యక్రమంలో జహీర్ అక్తర్, రాజేష్, అజహర్, శ్రీహరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అన్ని విధాల సాయం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): క్రీడాకారులకు అన్ని విధాల సాయం అందిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ మండలంలోని ధర్మాపూర్‌లో ఎస్టీ గురుకులంలో 9వ తరగతి చదువుతున్న తులసి తైవాన్‌లో నిర్వహించే అంతర్జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల్లో పాల్గొననుంది. ఇందుకు పాస్‌పోర్టు త్వరగా వచ్చేలా చూడాలని మంత్రిని క్రీడాకారిణితోపాటు ఆమె తండ్రి కిషన్ కోరారు. స్పందించిన మంత్రి పాస్‌పోర్టు త్వరగా వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ చల్లాకు ఘన సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జిల్లా కేంద్రానికి టీఆర్ఎస్ నాయకుడు ఎండి.ఇమ్రాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకె అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పులి శిల్పేష్, వెంకట్రాంరెడ్డి, అతహర్, తబ్రేజ్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై చర్యలు తీసుకోండి


వినతిపత్రం అందిస్తున్న గొల్ల కురుమలు

చిన్నచింతకుంట: ప్రభుత్వం అందించే రెండవ విడత గొర్రెల పంపిణీ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు ఉన్నాయని మండల కేంద్రానికి చెందిన శంకరయ్య, దామోదర్, శేఖర్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలకు పాల్పడుతూ ఒకే కుటుంబంలో భార్యాభర్తలను ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం అవుతున్నారన్నారు. పశువైద్యాధికారి మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. అవకతవకలు ఉంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏవైన తప్పిదాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావలని వారికి సూచించారు.

జానంపేటలో రైతుల ఆందోళన


జానంపేటలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజుల

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేటలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ బుధవారం రైతులు ఆందోళన చేశారు. సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోసుకుంటే అకాల వర్షాలకు తడుస్తుందని, రోజుల తరబడి ధాన్యాన్ని కాపాడుకోవడం తమ వల్ల కావడం లేదని ఏఈఓ నివేదిత, సింగిల్‌విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ వద్ద ఆందోళన వెలిబుచ్చారు. తూర్పు పట్టని ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే అక్కడ మిల్లర్లు ధాన్యం కొనకుండా తిప్పి పంపుతున్నారని అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ధాన్యం తూర్పు పట్టని రైతులకు టోకెన్లు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ మంజుల అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు. ధాన్యంలో తాలు లేకుండా ఉంటే కొనుగోలు సులువవుతుందని నచ్చజెప్పారు. కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా ఇటీవల ధాన్యాన్ని పరిశీలించి టోకెన్లు ఇచ్చిన అధికారులు, ఇప్పుడు ధాన్యం తూర్పు పడితేనే మళ్లీ టోకెన్లు ఇస్తామని అంటున్నారని రైతులు తెలిపారు.

కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న ప్రభుత్వం


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ ఆరోపించారు. కార్మికుల దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని అమ్మపురంలో కార్మిక వారోత్సవాలు నిర్వహించి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలను రద్దు చేస్తూ హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను ఎత్తివేసే విధంగా వ్యవహరిస్తూ బడ్జెట్‌లో నిధులను తగ్గించిందన్నారు. కార్మికులు మేడే స్ఫూర్తితో ఉద్యమించి కార్మిక చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హన్మంతు, భగవంతు, వెంకటేష్, కురుమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం


చిన్నచింతకుంట మండలంలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని, పీఎఫ్ఐతో పోల్చడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌరస్తాలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని పెట్టడం, పీఎఫ్ఐతో పోల్చడాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, హనుమంతు, జనార్దన్, లక్ష్మీనారాయణ, కుమార్, సంపత్, వర్మ, ఛత్రపతి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తిలో బజరంగదళ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కార్యకమంలో సందీప్, మహేష్, దీపక్, తిరుపతి, శివ, రాజు, నిఖిల్, నరేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సన్మానం

మిడ్జిల్: ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మండలంలోని జర్నలిస్టులను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుదర్శన్ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. 24 గంటలు నిరంతరం ప్రజలకు ప్రభుత్వానికి వారధిలాగా పత్రికలు పనిచేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, నాయకులు పాల్గొన్నారు.


జర్నలిస్టులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కరాటేతో దేహదారుఢ్యం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్ వల్ల శారీరక దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని మున్సిపల్ చైర్మన్ నర్సింహులు అన్నారు. కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం పోస్టర్లను బుధవారం తన నివాసంలో చైర్మన్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. కరాటేలో రాణించేవారు చదువులో కూడా ముందుంటారని అన్నారు. వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీని అభినందించారు. క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ 24 ఏళ్లుగా జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఈ ఏడాది 25వ (సిల్వర్ జూబ్లీ) ఉచిత కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి వచ్చేనెల 4 వరకు శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ప్రతి ఆదివారం విద్యార్థులకు కిక్‌బాక్సింగ్, యోగా, జూడో, కర్ర విన్యాసాలపై ప్రత్యేక నైపుణ్యంగల కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9849301171 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రఫీక్ పటేల్, అబ్దుల్ జకీ, చెన్న వీరయ్య, బాలు మహేందర్ నాయక్, మహ్మద్ హమీద్ అలీ, అర్ష జమీల్, ఉజేఫ్ తదితరులు పాల్గొన్నారు.


కరాటే శిక్షణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ నర్సింహులు తదితరులు

విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

బాలానగర్: మండల కేంద్రంలో మూడు రోజులుగా జీకే చోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన నందిని, చరిత, ఇందు, సరిత, గంగ, లక్ష్మీప్రసన్న, కల్యాణ్, సుభోద్ కుమార్, సంతోష్, రోహిత్‌కు ఎస్ఐ జయ ప్రసాద్, కరాటే క్లబ్ ఫౌండర్ కృష్ణయ్య బ్లాక్ బెల్టులను ప్రదానం చేశారు.